# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 16 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ‘సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షిద్దాం’

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడులతో సింధు నదీ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యూటి) భారత్ నిలిపివేసిన నేపథ్యంలో దానిపై చర్చలు ప్రారంభించేందుకు, ఒప్పందాన్ని సమీక్షించేందుకు సిద్ధంగా వున్నట్లు పాకిస్తాన్ తెలియజేసింది. ఈ మేరకు పాక్ జలవనరుల శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా నుండి భారత్ జల వనరుల శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీకి వారం రోజుల క్రితమే ఒక లేఖ అందిందని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్‌కు చెందిన సింధు జలాల కమిషనర్‌తో చర్చలు జరిపేందుకు ఒక ప్రతినిధిని నియమిం చాల్సిందిగా ఆ లేఖలో కోరారు. కచ్చితంగా ఏ రోజున ఈ లేఖ పంపారనే విషయం వెల్లడించడానికి ఆ వర్గాలు నిరాకరించాయి. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ ఉత్తరం పంపినట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీనిపై వ్యాఖ్యానించడానికి భారత విదేశాంగ శాఖ నిరాకరించింది. సింధుజలాల ఒప్పందంపై తిరిగి ఇరు దేశాల ప్రభుత్వాలు చర్చలు జరపాలన్నది భారత్ వైఖరిగా వుంది. అవి జరిగేవరకు శాశ్వత సింధు కమిషన్ (పిఐసి) సమావేశాలేవీ జరగబోవని భారత్ గత సెప్టెంబరులోనే చెప్పింది. 2023 జనవరి నుండి భారత్ నాలుగుసార్లు పాకిస్తాన్‌కు లేఖ రాసింది, ఒప్పందాన్ని సవరించడంపై చర్చలు ప్రారంభించాలని కోరింది. పాకిస్తాన్ నుండి సంతృప్తికరమైన సమాధానం రాలేదు. తాజా పరిస్థితుల్లో సమావేశం కావడానికి, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించడానికి సుముఖంగా వున్నట్లు పాక్ పేర్కొంటోంది.

# రాష్ట్రపతికి డెడ్‌లైన్ ఏంటి?



- సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నలు!
- అధికరణలపై వివరణలు కోరిన ద్రౌపది ముర్ము

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అత్యున్నత న్యాయస్థానానికి 14 ప్రశ్నలు సంధించారు. రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రభుత్వం, ఆ రాష్ట్ర గవర్నర్ మధ్య నెలకొన్న వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ గవర్నర్లు పంపే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతికి గడువు విధించింది. రాష్ట్రపతి అనుమతి కోసం తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి 10 బిల్లులను తన వద్దే అట్టి పెట్టుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. కాగా తాజాగా సుప్రీంకోర్టు తీర్పుపై కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ ఈ నెల 13న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓ ప్రశ్నావళిని పంపినట్లు వార్తలు వచ్చాయి. తమ అనుమతి కోసం వచ్చిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఆర్టికల్ 143 ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా అని ఆమె ప్రశ్నించారు. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి ఇచ్చే అనుమతులు సమర్ధనీయమా అనే విషయంపై సైతం సుప్రీంకోర్టు భిన్నమైన తీర్పులు ఇచ్చిందని గుర్తు చేశారు.

‘లైవ్‌లా’ పోర్టల్ ప్రకారం సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పంపిన 14 ప్రశ్నలు ఇలా ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద తనకు బిల్లులు పంపినప్పుడు గవర్నర్ ముందు ఉన్న రాజ్యాంగపరమైన మార్గాలు ఏమిటి? ఆర్టికల్ 200 కింద తనకు ఓ బిల్లును పంపినప్పుడు తనకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ మంత్రిమండలి అందించే సహాయానికి, సలహాకు గవర్నర్ కట్టుబడి ఉంటారా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణను ఉపయోగించడం న్యాయబద్ధమేనా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే చర్యపై న్యాయ సమీక్షకు ఆర్టికల్ 361 అవరోధంగా ఉన్నదా? రాజ్యాంగపరంగా కాలపరిమితి ఏదీ సూచించనప్పుడు, గవర్నర్ ఏ విధంగా అధికారాలను ఉపయోగించుకోవాలో నిర్దేశించనప్పుడు ఆర్టికల్ 200 ప్రకారం ఉన్న అన్ని అధికారాలను ఉపయోగించుకోవడానికి న్యాయపరమైన ఆదేశాల ద్వారా కాలక్రమాలను విధించవచ్చా, అధికారాలను ఎలా ఉపయోగించుకోవాలో నిర్దేశించవచ్చా?

రాజ్యాంగంలోని 201వ అధికరణ కింద రాష్ట్రపతి రాజ్యాంగపరమైన విచక్షణను మిగితా 2వ పేజీలో

### కాళేశ్వరం

# ఆలయ అభివృద్ధికి రూ.200కోట్లు

- గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం
- సరస్వతీ పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగానికి అభినందనలు
- భక్తుల కోసం మొట్టమొదటిసారిగా టెంట్ సిటీని ఏర్పాటు
- గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సరస్వతి పుస్కరాల్లో పాల్గొన్న సీఎం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ సమగ్రాభివృద్ధికి అవసరమైతే రూ.200 కోట్ల వరకు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సరస్వతీ పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మొట్టమొదటిసారిగా టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు రానున్నాయని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం తనకు కలగనుందని అన్నారు. తెలంగాణలో రాబోయే గోదావరి, కృష్ణా పుష్కరాలను అత్యంత అద్భుతంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. వాటిని అద్భుతంగా నిర్వహించడానికి శ్రీకారంగా పవిత్ర సరస్వతి మహా పుష్కరాలతో కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు.

ఈ పవిత్ర పుష్కరాల్లో పాల్గొనడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. “తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పవిత్ర సరస్వతి పుష్కరాలే మొట్టమొదటివి. ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక క్షేత్రంగా, ఒక ఆదర్శవంతమైన ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం. ఈ ప్రాంత అభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.మన సంస్కృతి సంప్రదాయాలను శాశ్వతంగా భవిష్యత్తు తరాలకు అందించడానికి అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపడుతూ ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఈ ప్రాంతానికి గోదావరి నది ప్రకృతి ఆశీర్వాదం. గోదావరి పుష్కరాలు అద్భుతంగా నిర్వహించాలంటే ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని రకాలుగా వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.దీన్ని పర్యాటక క్షేత్రంగా, ఎంతో చరిత్ర కలిగిన ఇక్కడి కాళేశ్వర దేవాలయం అద్భుతంగా తీర్చిదిద్దడానికి మంత్రి శ్రీధర్ బాబు గారు కోరినట్టు వంద కాదు రెండు వందల కోట్ల రూపాయలైనా, గ్రీన్ ఛానల్లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆ బాధ్యత నేను తీసుకుంటా. రాబోయే మూడేళ్లలో వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలు, సమ్మక్క సారలమ్మ జాతరలను బ్రహ్మాండంగా నిర్వహిస్తాం.

ఈ ప్రాంతానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వచ్చే విధంగా ఒక గొప్ప పర్యాటక క్షేత్రంగా అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గానికి అదనంగా నిధులు ఇవ్వడం ఒక బాధ్యతగా భావిస్తున్నాను.మంథని శాసనసభ నియోజకవర్గానికి ఒక గొప్ప చరిత్ర ఉంది. దేశానికి నాయకత్వాన్ని అందించడమే కాదు. దేశాన్ని ఆర్థిక పథం వైపు ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా ఒక బలమైన ఆర్థిక దేశంగా ఈనాడు ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక దేశంగా నాయకత్వం వహించిన పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచి శాసనసభ్యులుగా ప్రాతినిథ్యం వహించారు. అలాగే ప్రజా జీవితంలో ఆదర్శవంతమైన నాయకుడిగా శ్రీపాదరావు ప్రఖ్యాతులు గడించారు. మూడో తరంలో మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. రాష్ట్రానికి 3 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడంలో వారి పాత్ర మరువలేనిది. మిగితా 2వ పేజీలో

# పాక్ అణ్వాయుధాల భద్రతపై అనుమానం



- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- జమ్ము కశ్మీర్‌లో పర్యటించిన మంత్రి

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పాకిస్థాన్‌లో అణ్వాయుధాల భద్రతపై అనుమానం ఉందని వాటిపై అంతర్జాతీయ సంస్థల నిఘా అవసరమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తెలిపారు. ఆదేశ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను కచ్చితత్వంతో ధ్వంసం చేసి ముష్కరమూకలకు భారత్ తగిన గుణపాఠం చెప్పిందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి రక్షణమంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. అమరులైన సైనికులకు రాజ్‌నాథ్‌సింగ్ శ్రీనగర్‌లో నివాళులర్పించారు. సైనిక బలగాలతో ముచ్చటించిన రక్షణమంత్రి, ఆపరేషన్ సిందూర్ విజయంపై సైన్యాన్ని ప్రశంసించారు. సైనిక ఉన్నతాధికారులను కలిసి భద్రతా పరిస్థితిని, సాయుధ దళాల పోరాట సంసిద్ధతను సమీక్షించారు. బాదామీ బాఘ్ కంటోన్మెంట్ వద్ద జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కలిసి భారత్ తుక్కుచేసిన పాక్ డ్రోన్లు, క్షిపణుల శకలాలను పరిశీలించారు

బాదామీ బాఘ్ కంటోన్మెంట్‌లో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. పహల్గాంలో మతం అడిగి మరీ పర్యటకులను చంపారనీ తద్వారా దేశ ప్రజలను విడదీయాలని చూశారని తెలిపారు. ముష్కరుల దుశ్చర్యలకు ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రస్థావరాలపై దాడులు చేసి వారిని తుదముట్టించిన భారత సైనికుల పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందని ప్రశంసించారు. ఇకపై ఉగ్రదాడులను దేశంపై యుద్ధంగానే పరిగణిస్తామని ప్రధాని మోదీ చెప్పారన్న రక్షణమంత్రి, మనం దాడి చేసిన తీరును శత్రువు ఎప్పటికీ మరువడని తెలిపారు.

‘పాకిస్థాన్ అణు బెదిరింపులకు భారత్ భయపడదు. భారత్‌పై అణు దాడి చేస్తామంటూ పాకిస్థాన్ చేసిన బెదిరింపులను యావత్ ప్రపంచం అనేకసార్లు చూసింది. ఇప్పుడు శ్రీనగర్ సాక్షిగా నేను ప్రపంచాన్ని అడగాలనుకుంటున్నాను. ఒక బాధ్యతారహితమైన దుర్మార్గపు దేశపు చేతుల్లో అణ్వాయుధాలు సురక్షితంగా ఉంటాయా ? పాకిస్థాన్ అణ్వాయుధాలను అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణలోకి తీసుకోవాలని నేను కోరుతున్నాను’ అని రాజ్‌నాథ్ చెప్పారు. బాదామీ బాఘ్ కంటోన్మెంట్ వద్ద సైనికులతో కలిసి రాజ్‌నాథ్‌సింగ్, ఒమర్ అబ్దుల్లా, మనోజ్ సిన్హా భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

# పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టండి



- జూలై 23 కల్లా చేపట్టాలి
- లేకపోతే సీఎస్ సహా అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది
- సుప్రీంకోర్టు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై మరోసారి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలకు చేసింది. ఆ భమూల్లో చెట్ల నరికివేతపై న్యాయస్థానం సీరియస్ అయ్యింది. ఆ ప్రాంతంలో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. జూలై 23 కల్లా పర్యావరణాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టక పోతే సీఎస్ సహా అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఐటీపార్క్ అభివృద్ధి కోసం చెట్లను నరికివేయండం సరికాదని కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై తాజాగా మరోసారి సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బుల్డోజర్లు తీసుకొచ్చి చెట్లను నరికారు, అధికారులు సమర్థించుకునే ప్రయత్నం చేయొద్దని కోర్టు వ్యాఖ్యానించింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. జూలై 23 కల్లా ఆ ప్రాంతంలో పర్యావరణాన్ని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోర్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను పాటించకపోతే సీఎస్ సహా కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది. తదరుపరి విచారణను జూలై 23కు వాయిదా వేసింది.



# భారత్‌లో ఐఫోన్ల తయారీ వద్దు

- యాపిల్ సంస్థకు ట్రంప్ కీలక సూచన
- ట్రంప్ వ్యాఖ్యలతో సంబంధం లేకుండా భారత్‌లో పెట్టుబడులు కొనసాగిస్తామన్న యాపిల్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టవద్దని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాపిల్ సంస్థ సీఈఓ టిమ్ కుక్‌కు సూచించారు.దోహా పర్యటన సందర్భంగా భారత్‌లో యాపిల్ ఐఫోన్ల తయారీపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో యాపిల్ తన ఉత్పత్తుల తయారీని పెంచుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఇండియాలో యాపిల్ తయారీని హైలైట్ చేస్తూ ‘తమ పని తాము చూసుకుంటారు’అని సీఈఓ టిమ్‌కుక్‌కు సూచించారు. భారతదేశం లేదా చైనా వంటి దేశాల్లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టడం, తయారీ ప్లాంట్లను స్థాపించడం తగదని, మిగితా 2వ పేజీలో

## జులై 9కి సార్వత్రిక సమ్మె వాయిదా

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

మే 20న జరగాల్సిన కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె జులై 9 నాటికి వాయిదా పడింది. గురువారం కేంద్ర కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. దేశంలోని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మే 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించారు. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల అమలును దూకుడుగా ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. పని గంటలను పెంచుతోందని, కార్మిక సంఘాల



# యాదగిరిగుట్ట
# నరసింహస్వామిని దర్శించుకున్న సుందరీమణులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి దర్శనానికి మిస్ వరల్డ్ పోటీదారులు విచ్చేశారు.వారు ఆలయ అతిథి గృహం నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాల్లో కొండపైకి వెళ్లారు. అఖండ దీపారాధన మండపంలో జరిగిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ విశిష్ట వేడుకలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి కూడా హాజరయ్యారు.ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి భాస్కర్ పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత కోసం తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆక్టోపస్ బలగాలు మోహరించాయి.విశ్వసుందరీల రాకతో యాదగిరిగుట్టలో భక్తిభావం మేళవించింది. విదేశీ అతిథులు ఆలయ శిల్పకళపై ఆశ్చర్యపోయారు.

యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహ ఆలయాన్ని 10 మందితో కూడిన మిస్ వరల్డ్ పోటీదారుల బృందం సందర్శించింది. మరో 25 మంది బృందం భూదాన్ పోచంపల్లిలో పర్యటిస్తోంది. ఆలయానికి చేరుకున్న సందరీమణులు ముందుగా అతిథి గృహానికి వెళ్లారు. అక్కడ ప్రొజెక్టర్ ద్వారా వీడియో ప్రెజెంటేషన్?లో ఆలయ విశిష్టతను ఆలయ వైస్ చైర్మన్ మిగితా 2వ పేజీలో

# రాష్ట్ర మహిళల ఆత్మ గౌరవాన్ని అవమానిస్తున్నాం

- సోనియాగాంధీకి మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ లేఖ
- కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం : మంత్రి సీతక్క



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించిన సంఘటనలు రాష్ట్ర మహిళల ఆత్మ గౌరవాన్ని అవమానించే విధంగా ఉన్నాయని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీకి బీఆర్ఎస్ . మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ లేఖ రాశారు. ఆత్మగౌరవంతో సాధించుకున్న తెలంగాణను బానిసత్వం వైపు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నడిపిస్తోందని తెలిపారు.గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అడుగడుగునా మోసం చేస్తోందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే తన తీరు మార్చుకోవాలని లేఖలో స్పష్టం చేశారు. విదేశీ మహిళలకు కాళ్లు కడిగించిన ఘటన తీవ్రమైన దుమారానికి, వివాదానికి దారితీస్తోందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మహిళలకు, తల్లులకు, అక్కాచెల్లెళ్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర మహిళలు కాంగ్రెస్ పార్టీపై తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

మిస్ వరల్డ్ పోటీదారులు ములుగు, రామప్ప దేవాలయ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రామప్ప దేవాలయంలోకి వెళ్లే ముందు అందాల భామలు కాళ్లు కడుక్కుని వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు నీళ్లు పోయడం వివాదాస్పదమైంది. తెలంగాణ మహిళలతో అందాల భామల కాళ్లు కడిగిస్తారంటూ బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి ఇది తీవ్ర అవమానకరమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# మెట్రో చార్జీల పెంపు

- రేపటి నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి..
- కనిష్ట చార్జి రూ.12..గరిష్ట చార్జీ రూ.75కు పెంపు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ షాకిచ్చింది. ఒకేసారిగా భారీగా మెట్రో చార్జీలను పెంచేసింది. తాజా నిర్ణయం ప్రకారం మెట్రో రైలు కనీస చార్జి రూ. 10 నుంచి రూ. 12కు, గరిష్ఠ చార్జి రూ. 60 నుంచి రూ. 75కు పెరిగింది. పెరిగిన మెట్రో చార్జీలు రేపటి(ఈ నెల 17) నుంచి అమల్లోకి రానున్నాయని ఎల్అండ్‌టీ సంస్థ గురువారం ప్రకటించింది. మెట్రో రైల్వేస్ చట్టం 2002లోని సెక్షన్ 34 ప్రకారం, చార్జిల సవరణ స్వరూపాన్ని సిఫార్సు చేసేందుకు హైకోర్టు మాజీ జడ్జి సారథ్యంలో ఫేర్ ఫిక్సేషన్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) ఏర్పాటైందని, ఫేర్ ఫిక్సేషన్ కమిటీ 25 జనవరి 2023న సవరించిన చార్జిల స్వరూపాన్ని సిఫార్సు చేస్తూ నివేదికను సమర్పించిందని తెలిపింది. మెట్రో రైల్వే ఓఅండ్ఎం చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం.. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు చార్జిలు పెంచినట్టు చెప్పింది. హైదరాబాద్ మెట్రో సర్వీసులు అందరికీ అందుబాటులో ఉండేలా కొనసాగించడానికి, నాణ్య మైన సేవలు అందించేందుకు చార్జీల సవరణ ఉపయోగపడుతుందని మెట్రో రైల్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు సహకరించాలని ఎల్అండ్‌టీ సంస్థ విజ్ఞప్తి చేసింది.

# భూ వివాదాలకు పరిష్కారం కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా భూ లావాదేవీలను సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి కర్ణాటక రాష్ట్రంలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఐదు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని తెలిపారు. ఇందుకోసం ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి తెలంగాణ సర్వే శిక్షణా అకాడమీలో శిక్షణ ఇస్తామన్నారు.

కర్ణాటక రాష్ట్రంలో అమలు అవుతున్న లైసెన్స్‌డ్ సర్వే విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్



పథకం 1999 లో కర్ణాటక ల్యాండ్ రెవెన్యూ చట్టంలో చేసిన సవరణలతో ప్రారంభమై, 2005-06 నుంచి అమలులోకి వచ్చిందని, ఈపథకం ద్వారా భూముల రిజిస్ట్రేషన్‌కు ముందు మ్యూటేషన్ స్కెచ్ (%లామీ%) తయారు చేయబడుతుందని, ప్రీ-రిజిస్ట్రేషన్ స్కెచ్‌తో కొనుగోలు చేయబోయే భూమి గురించి విస్తీర్ణం, టైటిల్ వంటి స్పష్టమైన భూసరిహద్దు వివరాలు ఉంటాయని అధికారులు మంత్రికి వివరించారు.

ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో 6000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ,4000 మంది ప్రభుత్వ సర్వేయర్లు సేవలందిస్తున్నారని ఒక్కో లైసెన్స్‌డ్ సర్వేయర్ కు నెలకు సగటున 23 దరఖాస్తులు వస్తాయని, దీని ద్వారా అతనికి నెలకు 25 వేల నుండి 30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించి, రిజిస్ట్రేషన్ కు ముందు స్కెచ్ తయారుచేసి పోర్టల్లో అప్ లోడ్ చేస్తారు. వీరి పనులను ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి, సంబంధిత అధికారి ఆమోదిస్తారు. ఈ పథకం ద్వారా భూలావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా సాగుతున్నాయని అధికారులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూతెలంగాణ రాష్ట్రంలో శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, ఈ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ విధానం అమలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని ఆయా మండలాల్లో భూలావాదేవీలు, భూ విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్లను నియమించాలని అధికారులకు సూచించారు. కర్ణాటక రాష్ట్రంలో దాదాపు 20ఏళ్ల క్రితం నియమితులైన సర్వేయర్లు కొనసాగుతూనే ఉన్నారని ఇక్కడ కూడా అదే విధానాన్ని అవలంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

# కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి రూ.200కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

**అంగరంగ వైభవంగా ప్రారంభమైన పవిత్ర సరస్వతి మహా పుష్కరాలు**

అంగరంగ వైభవంగా ప్రారంభమైన పవిత్ర సరస్వతి మహా పుష్కరాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత పుష్కర ఘాట్ వద్ద వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ సరస్వతీ దేవి వారి ఏకశిలా విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. త్రివేణి సంగమం వద్ద పవిత్ర పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ సరస్వతీ దేవి ఆలయానికి చేరుకుని అమ్మ వారిని దర్శించుకుని ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించారు. ముఖ్యమంత్రి గారు అక్కడ పవిత్ర పుష్కరాలను ప్రారంభించిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. ఆ తర్వాత కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సరస్వతి దేవి ఏకశిలా విగ్రహం ముందు నదీ ముఖంగా ఏర్పాటు చేసిన వేదికపై మహా సరస్వతి నవరత్నమాల స్తోత్రంతో 9 హారతులను అందించిన మహాద్భుత ఘట్టాన్ని ముఖ్యమంత్రి గారు సహచర మంత్రులతో కలిసి వీక్షించారు. పుష్కరాల సందర్భంగా వారణాసిలో గంగా నదికి హారతినిచ్చే ఏడుగురు వేద పండితులు ప్రత్యేక ఆహ్వానితులుగా సరస్వతి పుష్కరాలకు విచ్చేసి ఈ నవరత్న మాల హారతులను ఇచ్చారు. ముఖ్యమంత్రి గారు కాళేశ్వరం చేరుకున్న సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, కొండా సురేఖ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధి ారులు ముఖ్యమంత్రి గారితో ఈ పవిత్ర పుష్కరాల్లో పాల్గొన్నారు.

## రాష్ట్రపతికి డెడ్‌లైన్ ఏంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించడం న్యాయబద్ధమేనా? రాజ్యాంగపరంగా కాలక్రమాన్ని సూచించనప్పుడు, రాష్ట్రపతి ఏ విధంగా అధికారాలను ఉపయోగించుకోవాలో నిర్దేశించనప్పుడు ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి తన విచక్షణను ప్రదర్శించి న్యాయపరమైన ఆదేశాల ద్వారా కాలక్రమాలను విధించవచ్చా, అధికారాలను ఉపయోగించుకోవచ్చా? రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ బిల్లును తన వద్దే అట్టి పెట్టుకున్నప్పుడు లేదా ఇతర కారణాలతో అట్టి పెట్టుకున్నప్పుడు ఆర్టికల్ 143లో పేర్కొన్న విధంగా రాష్ట్రపతి సుప్రీంకోర్టు అనుమతిని, అభిప్రాయాన్ని తీసుకోవాలా? ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్, ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు చట్టానికి ముందు అమలులోకి వచ్చిన దశలో న్యాయబద్ధమేనా, బిల్లు చట్టంగా మారడానికి ముందు దానిలోని అంశాలపై కోర్టులు న్యాయపరమైన తీర్పులు ఇవ్వవచ్చా?

రాజ్యాంగపరంగా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు ఉన్న అధికారాలను, వారు జారీ చేసే ఆదేశాలను రాజ్యాంగంలోని 142వ అధికరణ కింద మార్చవచ్చా? రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాన్ని ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా అమలు చేయవచ్చా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 145 (3)లోని నిబంధన ప్రకారం...న్యాయస్థానంలోని ఏ బెంచ్ అయినా తన ముందుకు వచ్చిన కేసులో రాజ్యాంగ వివరణలకు సంబంధించిన చట్టపరమైన ప్రశ్నలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని ముందుగా నిర్ణయించడం, దానిని కనీసం ఐదుగురు సభ్యుల బెంచ్‌కు నివేదించడం తప్పనిసరి కాదా? కోర్టు వ్యవస్థ చట్టపరమైన అంశాలను ఏ విధంగా పరిష్కరించాలనే విషయంపై నియమ నిబంధనలు ఉన్నాయి.

ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు అధికారాలు ఆ నియమ నిబంధనలకే పరిమితమవుతాయా లేక వాటికి విరుద్ధంగా ఆదేశాలు జారీ చేస్తాయా? ఆర్టికల్ 131 కింద వేసే వ్యాజ్యం ద్వారా మినహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టుకు ఉన్న ఇతర అధికార పరిధిని రాజ్యాంగం నిషేధిస్తుందా?.

## భారత్‌లో ఐఫోన్ల తయారీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికాలోనే వీటిని చేపట్టాలని ట్రంప్ నిరంతరం యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఈ విధానాన్ని కట్టడి చేసేందుకే టారిఫ్‌లను విధిస్తున్నట్లు గతంలో తెలిపారు. కొంతకాలంగా యాపిల్ తన ఐఫోన్ ఉత్పత్తిని భారత్‌లో వేగంగా విస్తరిస్తోంది. ఇటీవల చైనాపై అధిక దిగుమతి సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో యాపిల్ వంటి దిగ్గజ కంపెనీలు భారత్‌లో మరింత వేగంగా విస్తరించాలని చూస్తున్నాయి. ఈ సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

అయితే టెక్ దిగ్గజం మాత్రం తన ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. భారత్‌లో ఉత్పత్తిని విస్తరించడం ద్వారా యాపిల్‌కు గణనీయమైన ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. భారత్‌లో తయారీ రంగం అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు అనుకూలంగా ఉందని, ఇక్కడ ఉత్పత్తి చేయడం ద్వారా యాపిల్ వంటి సంస్థలు పోటీతత్వాన్ని అందిపుచ్చుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అధిక శాతం జూన్ త్రైమాసికం నుంచి "మేడ్ ఇన్ ఇండియా" ట్యాగ్‌తో ఉంటాయని యాపిల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో, ఈ ప్రయోజనాలను కంపెనీ గుర్తించాలని వారు సూచించారు. "కంపెనీల పెట్టుబడి నిర్ణయాలు వారి పోటీతత్వంపైనే ఆధారపడి ఉంటాయి" అని వారు పేర్కొన్నారు.

పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్‌లో జరిగిన ఓ వాణిజ్య సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, "మిత్రమా, నేను నిన్ను బాగానే చూసుకుంటున్నాను. కానీ ఇప్పుడు మీరు భారత్‌లో తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని వింటున్నాను. మీరు భారత్‌లో నిర్మించవద్దు. భారత్ ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటి, కాబట్టి అక్కడ అమ్మడం చాలా కష్టం," అని టిమ్ కుక్‌తో అన్నట్లు తెలిపారు. యాపిల్ తన ఫ్యాక్టరీలను అమెరికాకు తరలిస్తుందని కూడా ట్రంప్ పేర్కొన్నప్పటికీ, కంపెనీ నుంచి అలాంటి ప్రకటన వెలువడలేదు.

## ప్రియుడితో కలిసి మాజీ జవాన్‌ను దారుణంగా చంపిన భార్య

- **శరీరాన్ని 6 ముక్కలుగా నరికి..**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రియుడితో కలిసి మాజీ సైనికుడైన తన భర్తను హత్య చేసింది ఓ భార్య. ఆ తర్వాత పోలీసులకు దొరకకుండా తప్పించుకునేందుకు భర్త మృతదేహాన్ని 6 ముక్కలుగా నరికి.. ఆ భాగాలను వేర్వేరు ప్రదేశాల్లో పడేసింది. ఈ దారుణ సంఘటన ఉత్తరప్రదేశ్ లో చోటుచేసుకుంది. ఈ కేసులో భార్య, ఆమె ప్రియుడితోపాటు వారికి సహకరించిన మరో ఇద్దరిని యూపి పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన ప్రకారం.. నిందితురాలు మాయా దేవి అనే 50 ఏళ్ల మహిళ బహదూర్‌పూర్ నివాసిస్తోంది. అయితే, ఆమె అనిల్ యాదవ్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంది. దీంతో భారత సైన్యంలోని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ విభాగంలో రిటైర్డ్ సిబ్బందిగా పనిచేసిన తన భర్త దేవేంద్ర కుమార్‌ను చంపడానికి కుట్ర పన్నింది. ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసింది. ఆ తర్వాత శరీర భాగాలను ఆరు ముక్కలుగా నరికి పడేసింది. అనంతరం మే 10న పోలీస్ స్టేషన్‌లో తన భర్త తప్పిపోయినట్లు ఆమె ఫిర్యాదు చేసింది. బీహార్‌లోని బక్సర్ రైల్వే స్టేషన్ నుండి తన కుమార్తెను తీసుకురావడానికి వెళ్ళాడని, కానీ తిరిగి రాలేదని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ముక్కలుగా నరికిన శరీర భాగాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. మొండెంను దేవేంద్ర కుమార్‌తో సరిపోల్చారు. మొదట నరికిన అవయవాలు, రెండు రోజుల తర్వాత మొండెం సమీపంలోని బావిలో కనుగొన్నారు. తర్వాత మాయా దేవిని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకుంది. భర్తను చంపి, అతని శరీరాన్ని ఆరు ముక్కలుగా చేసి, బలియా జిల్లాలోని ఒక నది ఒడ్డున వేర్వేరు ప్రదేశాలలో పడవేసినట్లు తెలిపింది. దీంతో వీరితోపాటు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. దేవేంద్ర తలను ఘాఘరా నదిలో పడేసినట్లు నిందితులు అంగీకరించారని పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడి తల ఇంకా కనిపించలేదని పోలీసులు చెప్పారు.

## 18న గోదావరిఖనిలో సింగరేణి మెగా జాబ్ మేళా

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రామగుండం 1 ఏరియా గోదావరిఖని లో వచ్చే ఆదివారం (మే 18) న సింగరేణి ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సుమారు 100 ప్రైవేటు సంస్థల లో వివిధ విభాగాల్లో 3 వేల ఖాళీలు భర్తీ కోసం ఎంపిక జరుగుతుందన్నారు . నిరుద్యోగ యువత హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంటోందని, ఈ నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి స్థానికంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## నేడు భారీ వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో శుక్రవారం కూడా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో వచ్చే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందనీ, సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వానలు, చిరుజల్లులు పడే సూచనలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 9:30 గంటల వరకు వందకుపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా మోయిన్‌పేటలో అత్యధికంగా 6.5 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. వికారాబాద్, హైదరాబాద్, మహబూబాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, జనగాం, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, మెదక్, నారాయణపేట్, హన్మకొండ, వనపర్తి జిల్లాల్లో పలుచోట్ల వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 41.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

## యాదగిరిగుట్ట నరసింహస్వామిని దర్శించుకున్న సుందరీమణులు

(మొదటి పేజీ తరువాయి)

కిషన్ రావు ప్రపంచ సుందరీ మణులకు వివరించారు. అనంతరం ఆలయ సందర్శనకు ఆలయంలోకి తీసుకెళ్లారు.తూర్పు మహాగోపురం వద్ద వేద పండితులు స్వాగతం పలుకగా త్రితల రాజగోపురం, ఆంజనేయస్వామి గుడి, ధ్వజస్తంభం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. తర్వాత గర్భాలయంలో స్వామి వారి దర్శనంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులతో ఆశీర్వచనం తీసుకుని.. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళకు ముగ్ధులైన మోడల్స్ ఆలయ శిల్పకళా సంపద కనపడేలా ఫోటోలు దిగారు. తర్వాత అతిథి గృహానికి చేరుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆర్డీఓ కృష్ణారెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, నల్గొండ జిల్లాలోని పోచంపల్లి మళ్లీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. టూరిజం విలేజ్‌గా ప్రసిద్ధి చెందిన ఈ గ్రామానికి 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు వచ్చారు.వారు అక్కడి ప్రజల నుండి హృద్య స్వాగతం పొందారు. గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో అతిథులను ఆత్మీయంగా స్వాగతించారు.అక్కడి ఇక్కత్ చీరల తయారీ శైలి వారిని ఆకట్టుకుంది. వర్ణరంజిత మగ్గాల దగ్గర పోటీదారులు సంతోషంగా సందడి చేశారు.కొంతమంది స్వయంగా మగ్గంపై కూర్చొని చీరలు నేసారు. ఇది వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది.ఈ పర్యటనతో పోచంపల్లి చేనేత ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందింది. కళా సంపదకు గౌరవం పెరిగింది.



## పారదర్శకంగా యువ వికాసం లబ్ధిదారులుగా ఎంపిక చేయాలి..

**-మే 20 లోపు లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలు సమర్పించాలి**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పారదర్శకంగా నిరు పేదలను యువ వికాసం లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ రాజీవ్ యువ వికాసం పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో రాజీవ్ యువ వికాసం క్రింద మనకు 36 వేల 819 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి 30 వేల 627 దరఖాస్తులను బ్యాంకులకు ఫార్వర్డ్ చేశామని , 6 వేల 192 దరఖాస్తులను వివిధ కారణాల చేత తిరస్కరించామని అన్నారు.

బ్యాంకులు 30 వేల 627 దరఖాస్తుదారుల బ్యాక్ గ్రౌండ్ స్క్రూట్ ని పూర్తి చేశాయని తెలిపారు. గంభీ రావు పేట మండలంలో దళారులు యువ వికాసం పథకం క్రింద యూనిట్ ఇప్పిస్తామని ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, పారదర్శకంగా యువ వికాసం యూనిట్ల ఎంపిక జరుగుతుందని ఎవరు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ పారదర్శకంగా వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.దళారుల ఒత్తిడి లేకుండా పేదలకు మాత్రమే పథకం అందాలని, ఎక్కడైనా అనర్హులకు చేరితే సమానత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలను మోసగిస్తున్న దళారుల పట్ల కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శేషాద్రి, ఎల్ డి ఎం మల్లికార్జున్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి బీసీ వెల్ఫేర్ అధికారి రాజ మనోహర్ ఈ.డి.ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎం.పి.డి.ఓ.లు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా?

**- అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలం**

**- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతన్నలను ఆదుకోవాలి**

**- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాష్ట్రంలో అకాల వర్షం వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులు తమ పంట అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతలపై లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం బోయినిపల్లి ఫాక్స్ సెంటర్ పరిధిలోని తడగొండ వద్ద కొనుగోలు కేంద్రాలలో, అకాల వర్షానికి తడిసి పోగా స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి ధాన్యం కేంద్రాలను సుంకె రవిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఐకేపీ సెంటర్ కు 15 రోజుల కింద వడ్లు తీసుకువచ్చినా కాంటా వేయలేదని, హమాలీల కొరత ఉందని,ఆరబోసిన వడ్లు చాలా వరకు వానకు కొట్టుకపోయినయని, టార్పాలిన్లు కూడా ఇవ్వలేదని, సమయానికి వడ్లు కొంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని,ఇప్పటికే 42 కిలోలకు 39 కిలోల చొప్పున లెక్క కడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని,అక్కడి రైతులు సుంకె రవిశంకర్ తో తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

అనంతరం సుంకె రవిశంకర్ మాట్లాడుతూ: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటు అని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా ధాన్యం కొనడం లేదని, రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమయిందని, ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించి, ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని చెప్పారు.రాజన్న సిరిసిల్ల కలెక్టర్ తో మాట్లాడుతూ పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జూ, మాజీ సర్పంచ్ చిందం రమేష్, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, మండలం నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, బాపురెడ్డి, లింగయ్య, బత్తిని కమల్ గౌడ్, రాజేష్, తదితరులు ఉన్నారు.

## మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**-నేడు రుద్రంగిలో పర్యటించనున్న మంత్రుల బృందం**



**బలగం టీవీ, వేములవాడ**

మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారుల ను ఆదేశించారు. గురువారం మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే లతో కలిసి చేయాల్సిన ఏర్పాట్ల పై విప్ ఆది శ్రీనివాస్ రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతి చట్టం ముందస్తుగా 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఒక మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రుద్రంగి భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వ భూములు వ్యవసాయ చేస్తున్న పేదలకు, దళితులు గిరిజనులకు అసైన్డ్ పట్టాలు, పోడు భూముల పట్టాలు పంపిణీ చేశామని,గత ధరణి చట్టం సమయంలో అసైన్మెంట్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందనిఅన్నారు.ధరణి వ్యవస్థతో పేదలకు అనేక ఇబ్బందులు వచ్చాయని, సమస్యల పరిష్కారానికి రూల్స్ తీసుకుని రాలేదనిఅన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మేరకు నూతనంగా భూ భారతి చట్టం రూల్స్ తో సహా ప్రవేశపెట్టిందని,ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అధ్యక్షుడిగా అసైన్మెంట్ కమిటీలను కూడా ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. అసైన్మెంట్ కమిటీల ద్వారా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటూ పట్టాలు రాని అర్హులు ఎవరైనా ఉంటే వారికి తప్పనిసరిగా అందజేస్తామనిఅన్నారు. రుద్రంగి మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వస్తారని తెలిపారు. రుద్రంగి మండలంలో మంజూరైన 243 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా హౌసింగ్ శాఖ మంత్రి చేతులమీదుగా జరుగుతుందని, రుద్రంగిలో ఇంటి కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఇంకా ఏమైనా పెండింగ్ లో ఉంటే వెంటనే మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనకు రైతులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు ఇచ్చారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుద్రంగి లో పర్యటించనున్నారని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత ప్రజా ప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని స్పెషల్ డిప్యూటీ కు సూచించారు.

రెవెన్యూ సదస్సుల వద్ద పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ మొదలగు ఏర్పాట్లను ఎంపీడీవో పకడ్బందీగా పూర్తి చేయాలని, హెలిపాడ్ వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని, టెంట్, కుర్చీలు , సభా వేదిక వంటి ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారి పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అంబులెన్స్ అందుబాటులో పెట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశం వద్ద ఫైర్ ఇంజన్ అందుబాటులో పెట్టాలనిఅన్నారు.. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పోసి ప్రారంభించే కార్యక్రమ ఇంటి స్థలాలు, హెలిపాడ్, బహిరంగ సభా వేదిక, రెవెన్యూ సదస్సులు జరిగే సభ వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి సహాయ కేంద్రం వంటివి పరిశీలించారు.సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.రాధాబాయ్ , రుద్రంగి తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఈఈ ఆర్ అండ్ బీ వెంకట రమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ శంకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించాలి

**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ,బోయినపల్లి**



ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. బుధవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ ఎస్పీ మహేష్ బి.గితే ను సందర్శించి,పోలీస్ స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు తీరును,విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు.పాత నేరస్థుల పై రౌడి షీటర్స్ పై నిఘా ఉంచాలన్నారు.నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని అన్నారు.స్టేషన్ పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు.ప్రతి రోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు.ఇక్కడ వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ , పి.ఎస్.ఐ అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు



## గల్ఫ్ బాధితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బలగం టీవీ, బోయినిపల్లి**

బతుకుతెరువు బతుకుతెరువు కోసం కన్న బిడ్డలను కట్టుకున్న భార్యను ఉన్న ఊరును వదిలి, ఉన్న అప్పులు తీర్చడానికి, పరాయి దేశం వెళ్లాడు. ఎడారి దేశంలో అక్కడ కంపెనీలో జీతం సరిగా లేక అప్పుడు తీర్చే పరిస్థితి లేక అప్పుల బాధతో తన పిల్లల భవిష్యత్తు ఎలాగా అని మనోవేదనకు గురై, ఇక ఆత్మహత్య శరణ్యం అనుకొని గత నెలలో దూస వెంకటేశం గల్ఫ్ లో ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నర్సింగాపూర్ గల్ఫ్ సేవాసమితి ఆధ్వర్యంలో గల్ఫ్ బాధితుని కుటుంబానికి అండగా 20000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సాయం చేయడం జరిగింది. విగతా జీవిగా మారిన అభాగ్యుడి కుటుంబానికి ఆశలుగా నిలుద్దాం. తోచినంత హార్థిక సహాయం చేద్దాం. ఈ కుటుంబానికి ఆర్థిక సాయం చేసేవారు 8464854746 ఫోన్ నెంబర్ కు ఫోన్ పే చేసి ఆదుకోవాలని గల్ఫ్ సేవా సమితి సభ్యులు కోరుతున్నారు.

# నేడే ఐపీఎల్ రీస్టార్ట్..



- ఆర్సీబీ- కేకేఆర్ మ్యాచ్‌తో ప్రారంభం
- ఛీర్‌లీడర్స్, డీజే లేకుండానే..!

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ 18వ సీజన్ ను మధ్యలో వారం పాటు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ సీజన్ శనివారం తిరిగి స్టార్ట్ కాబోతోంది.

### 17 మ్యాచ్ లు

ఈ ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇంకా పదిహేడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో ఆదివారాల్లో రెండు డబుల్ హెడర్లు, ప్లేఆఫ్స్ ఉన్నాయి. మే 29న క్వాలిఫైయర్ 1, మే 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫైయర్ 2, జూన్ 3న ఫైనల్ జరుగుతుంది.

ఐపీఎల్ నేడు ఆర్సీబీ– కేకేఆర్ మ్యాచ్‌తో టోర్నీ పునః ప్రారంభం కానుంది. అయితే మిగిలిన మ్యాచ్‌లను ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మ్యాచ్ లను సింపుల్‌గానే నిర్వహించాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ బీసీసీకి సూచించాడు. గ్రౌండ్‌లో చీర్ లీడర్స్, డీజే హడావుడి లేకుండా టోర్నీ జరపాలని బోర్డుకు చెప్పాడు. గతనెల కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో కుటుంబాల గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే గావస్కర్ ప్రస్తావించిన అంశాన్ని బీసీసీఐ కూడా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. అందుకు సమ్మతిస్తూ హంగు, ఆర్భాటాలు లేకుండా మిగతా మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



## ఇంగ్లండ్ పర్యటనకు భారత మహిళల జట్టు ఎంపిక

**బలగం టీవీ, హైదరాబాద్**

జూన్‌లో భారత మహిళల జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ఈ పర్యటన కోసం భారత సెలెక్టర్లు గురువారం జట్టును ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో భారత్.. 5 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. ఇందులో షఫాలీ వర్మ చోటు దక్కించుకుంది. తద్వారా దాదాపు ఏడాది విరామం తర్వాత షఫాలీ నీలిరంగు జెర్సీ వేసుకోనుంది. ఈమధ్యే శ్రీలంక గడ్డపై ముగిసిన ముక్కోణపు సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన విజయంలో కీలక పాత్ర పోషించిన స్నేహ్ రానా రెండు ఫార్మట్లకు ఎంపికైంది. వన్డేల్లో మాత్రమే ఆడుతున్న యస్తికా భాటియా, ఆల్‌రౌండర్ హర్లీన్ డియోల్ టీ20 స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. జూన్ 28న ట్రెంట్ బ్రిడ్జ్‌లో భారత్, ఇంగ్లండ్ తొలి టీ20 ఆడనున్నాయి. ఆ తర్వాత జూలై 22న ఇరుజట్ల మధ్య తొలి వన్డే జరుగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది.

**వన్డే స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ్ రానా, శ్రీ చరణి, సుచీ ఉపాధ్యాయ్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గాడ్, సయాలీ సత్గరే.

**టీ20 స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రానా, శ్రీ చరణి, సుచీ ఉపాధ్యాయ్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గాడ్, సయాలీ సత్గరే.

# డబ్ల్యూటీసీ విజేతకు భారీగా ప్రైజ్‌మనీ




**బలగం టీవీ, హైదరాబాద్**

2023–25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేతకు భారీగా ప్రైజ్ మనీ దక్కనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. ఈ సారి ప్రైజ్‌మనీ గత సారి కంటే రెట్టింపు కంటే ఎక్కువ. డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జూన్ 11 నుంచి 15 వరకు లార్డ్స్ మైదానంలో జరుగుతుంది.

2023–25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కోసం మొత్తం ప్రైజ్ మనీ 5.76 మిలియన్ అమెరికన్ డాలర్లు(సుమారు రూ.49.27కోట్లు) అని ఐసీసీ వెల్లడించింది. ఇది గత రెండు సార్లు కంటే చాలా ఎక్కువ. ఛాంపియన్ జట్టుకు 3.6 మిలియన్ అమెరికన్ డాలర్లు అందుతాయని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది 2021–23 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇచ్చిన 1.6 మిలియన్ అమెరికన్ డాలర్ల కంటే చాలా ఎక్కువ. రన్నరప్ జట్టు 2.16 మిలియన్ డాలర్లను అందుకుంటుంది. ఇది గతంలో ఇచ్చిన 8 లక్షల డాలర్ల కంటే చాలా ఎక్కువ.


2025 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ రేసులో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో నిలిచింది. ఫైనల్‌కు చేరుకున్న మొదటి జట్టుగా నిలిచింది. వారు పాకిస్థాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక జట్లపై సిరీస్‌లను గెలుచుకున్నారు. దీనితో పాటు భారత్‌తో జరిగిన సిరీస్ డ్రా అయింది. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భారత్‌ను 3–1 తేడాతో ఓడించి ఆస్ట్రేలియా అర్హత సాధించింది. ఈ సారి భారత్ మూడో స్థానంలో నిలిచింది. రెండు సార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు 1.44 మిలియన్ అమెరికన్ డాలర్లు(సుమారు రూ.12.31కోట్లు) అందుకుంటుంది. ప్రైజ్ మనీ పొందుతున్న జట్లలో భారత్ మూడో స్థానంలో ఉంది.

ఈ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జైషా మాట్లాడుతూ.. "ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో చాలా ఆసక్తికరమైన మూడో రౌండ్ ను చూశామని.. ఫైనల్స్‌కు చేరే జట్లను చివరి వరకు నిర్ణయించలేకపోయారన్నారు. ఈ ఛాంపియన్ షిప్‌లో వివిధ జట్ల ఆటగాళ్లు అద్భుతంగా రాణించారన్నారు. ఫలితంగా రెండు అత్యుత్తమ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయన్నారు. లార్డ్స్‌లో జరిగే ఈ వేడుకను ప్రేక్షకులు, ప్రపంచవ్యాప్తంగా చూస్తున్న అభిమానులు గొప్ప క్రికెట్‌ను ఆస్వాదిస్తారని తాను అనుకుంటున్నానన్నారు.

### ఐసీసీ ప్రపంచ ఛాంపియన్ షిప్ ప్రైజ్‌మనీ వివరాలు

విజేత (ఆస్ట్రేలియా/దక్షిణాఫ్రికా): 3,600,000 యూఎస్ డాలర్లు
రన్నరప్ (ఆస్ట్రేలియా/దక్షిణాఫ్రికా): 2,160,000 యూఎస్ డాలర్లు
3వ స్థానం (భారతదేశం): 1,440,000 యూఎస్ డాలర్లు
4వ స్థానం (న్యూజిలాండ్): 1,200,000 యూఎస్ డాలర్లు
ఐదవ స్థానం (ఇంగ్లాండ్): 960,000 యూఎస్ డాలర్లు
6వ స్థానం (శ్రీలంక): 840,000 యూఎస్ డాలర్లు
7వ స్థానం (బంగ్లాదేశ్): 720,000 యూఎస్ డాలర్లు
8వ స్థానం (వెస్టిండీస్): 600,000 యూఎస్ డాలర్లు
9వ స్థానం (పాకిస్తాన్): 480,000 యూఎస్ డాలర్లు

## ఆంధ్ర కింగ్ తాలూకా అంటున్న రామ్





**బలగం టీవీ, హైదరాబాద్**

రామ్ పోతినేని 22వ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. గురువారం రామ్ పుట్టినరోజు సందర్భంగా, ఈ చిత్రానికి 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పి. మహేశ్ బాబు ఈ సినిమాకు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేం పి.మహేష్ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సేకథానాయికగా నటిస్తుంది.

చిత్రాన్ని మూవీ ఇండస్ట్రీ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్టు గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది.గ్లింప్స్‌లో సినిమా థియేటర్ లో.. టికెట్ల కోసం పలుకు బడిని వాడటం.. ఎమ్మెల్యే, పోలీస్ తాలుకా అంటూ టిక్కెట్స్ అడ్వాన్స్ బుకింగ్ చేయడం.. తర్వాత ఆంధ్రా కింగ్ సూర్య సినిమా అంటే మామూలు విషయమా? అని చెప్పడం.. మన హీరో ఎంట్రీ ఇచ్చి ఫ్యాన్ అని చెప్పి.. ఆంధ్ర కింగ్ తాలుకా అని యాభై టికెట్లు తీసుకోవడవం వంటివి చూస్తుంటే నిజంగానే ఇదొక ఫ్యాన్ బయోపిక్ మాదిరిగానే అనిపిస్తుంది. చిత్రంలో సినిమా హీరో అభిమానిగా రామ్ కనిపించనున్నట్టు అర్థమవుతుంది. చిత్రంలో సాగర్ పాత్రలో రామ్, మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ నటిస్తుండగా.. వీరి మధ్య ఓ అందమైన లవ్ స్టోరీ కూడా ఉండబోతోందని అర్థమవుతోంది. వివేక్ మెర్విన్ మ్యూజిక్ హైలెట్‌గా నిలిచింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు.

## మరో సారి జోడి కడుతున్న బేబీ జంట

**బలగం టీవీ, హైదరాబాద్**



'బేబీ' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంట మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో ఓ సరికొత్త ప్రేమకథా చిత్రం రూపుదిద్దుకోనుంది. నైంటీస్'. ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ అనే వెబ్ సిరీస్‌తో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ సినిమాకు దర్శకుడు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన నేషనల్ క్రష్ రష్మిక మందన్న క్లాప్ కొట్టగా.. నటుడు శివాజీ కెమెరా స్విచ్ ఆన్ చేశాడు. దర్శకుడు వెంకీ అట్లూరి ఆదిత్య హాసన్‌కి కథను అందించాడు.ప్రొడక్షన్ నెం 32 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్‌లో రానుండగా.. 'నైంటీస్'. ఏ మిడిల్ క్లాస్ బయోపిక్ కొనసాగింపుగా ఈ సినిమా రాబోతుంది. దీనికి సంబంధించి ఇప్పటికే అనౌన్స్‌మెంట్ వీడియోను కూడా చిత్రయూనిట్ వదిలింది. టాలీవుడ్ నటుడు శివాజీ, వాసంతిక కీలక పాత్రలో నటిస్తున్నారు.

## బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌పై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌లో రాంగ్ రూట్‌లో వెళ్లడమే కాకుండా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించారంటూ ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ వద్ద శ్రీనివాస్ తన కారులో రాంగ్ రూట్‌లో వచ్చాడంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, సదరు హీరోను ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డుకుని హెచ్చరించారు. రాంగ్ రూట్‌లో ఎలా వస్తారంటూ కానిస్టేబుల్ ప్రశ్నించడంతో శ్రీనివాస్ అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు.